## తీయకు....

ఎందుకంటే ఈముసుగు నెలాగైనాభరించ వచ్చుకాని ఎండలకి, వానలకి తట్టుకుంటూ పక్షులకి పబ్లిక్ లేవట్రీగా ఉపయోగ పడుతూ రంగూ రూపూ కోల్పోయో, లేదా ఎన్నికలొస్తే వివిధ పార్టీల జండాలు మోసే కొయ్యలాగో...ఉపయోగపడేకన్న ఇలా ముసుగులో వుండడమే మంచిదని పిస్తోంది. నామాటమీద నమ్మకం చాలక పోతే అదుగో కొంచెం అప్ ఎక్కి కిందకి దిగితే ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగావున్న 'మహాకవి గురజాడ'గారి నడుగు. పక్షుల రెట్టలతో, ప్రకృతి భీభత్సాలతో ఆయనెలా సతమత మవుతున్నారో. మరో మాట చెప్పనా నాన్నా.. మొన్న హైదరాబాదులో జాతీయనాయకుడు, దళిత జన బాంధవ్యుడు అయిన బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని పోలికలు లేకుండా రూపొందించి, మొక్కుబడిగా ప్రతిష్టిస్తే, నగరప్రజలూ, నాయకులూ పోరుపెడితే ఆయన్ని తడికలమధ్య బందీనిచేసి చివరికి తొలగించేసారట. ఇది నాయనా మననాయకులకి పెద్దలమీదున్న అభిమానం. శిలా విగ్రహాన్ని చేయించి, దానితోపాటు ఫలకంమీద పేర్లు రాయించేసుకొని, ప్రతిష్ఠించి, పేపర్లోబొమ్మలుకట్టి మరీవేయించుకున్నప్పటి ఉత్సాహం....ఆతరువాత మన పాలకులకి వుండదు నాయనా! ఎందుకంటే మనది ప్రజాస్వామ్యం కదా! అంచేత వాళ్ళెప్పుడు ప్రజల సమస్యలతో సతమత మవుతూ వుంటారు. బతికున్న ప్రజల గురించి ఆలోచించే ఓపిక,-కోరిక, తీరిక లేని వాళ్ళని 'ఎప్పుడో ఏదోచేసిన'మమ్మల్ని గుర్తుపెట్టుకోమని ఇబ్బంది పెట్టడం ఏం బాగుంటుంది చెప్పు. కాబట్టి నాయనా ఎలాగోలా నన్ని ముసుగులోనే వుంచే ప్రయత్నం చెయ్యమ్మా..." ఆ మాటలు పూర్తి కాకుండా మధ్యలో నేను అడ్డుపడి "అదికాదు సార్.... మీలాటి మహానుభావులు.... ఇలా ఈ ముసుగుల్లో..." అని అనబోతుండిగా తక్కున కరెంటువచ్చింది. చుట్టూచూస్తే ఎవరూ కనిపించలేదు. జరిగిన దంతా మననం చేసుకుని 'నిజమే ముసుగు తీసేస్తే ఎన్ని ఇబ్బందులో'అనుకొని, ఆ ప్రయత్నాన్ని మానుకొని అప్రయత్నంగా పార్కులోంచి బయటపడ్డాను.





## మినీ కథ

### కొత్తపిట్ట



మోహన్, సుధీర్, దిలీప్, గోపీనాథ్ ఒకానొక కాలేజీ స్టూడెంట్లు. హాస్టల్లో వుండే కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనాలని, వేరేగా గది అద్దెకు తీసుకొని వుంటున్నారు. జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

ఆరోజు ఆదివారం. 10 గంటల సమయం. నలుగురు పేకాడుకుంటూ కూర్చున్నారు. వీధితలుపులు తెరిచేవున్నాయి. బైట సన్నగా తుంపర జల్లులా కురుస్తోంది. వాళ్ళు వుండుండి గ్లాసుల్లో వున్న మందుని గొంతులో పోసుకుంటున్నారు. అప్పుడు వచ్చాడు వీరప్పడు. పదహారేళ్ళ పిల్లాడు. "బాబులూ నాకే దైనా పనిప్పించరా!" అన్నాడు గుమ్మంలోకొచ్చి.

"ఎవ్వడ్రా వాడు?" అన్నాడు మోహన్.

"కనిపించడంలా నల్లని వాడు, సన్నని వాడు, గెద్దముక్కుగాడు..." అన్నాడు సుధీర్.

"ఏమంటున్నాడురా?" అన్నాడు మోహన్.

"వినిపించడంలే పని ఇప్పించమని వచ్చినాడు" అంటూ నవ్వాడు దిలీప్.

"పనిలేదు గినిలేదు పొమ్మను" చెప్పాడు గోపీనాథ్ గ్లాసులో ద్రవాన్ని గొంతులో పోసుకుంటూ.

"పని లేకపోవడం ఏమిటి— మనరూం ఒకసారి చూడు ఈ చెత్తంతా ఎవడు తుడుస్తాడు- మనకు టీ కావాలంటే గంటగంటకి ఎవడు తెచ్చిస్తాడు! మనకు మందు కావాలన్నా— కొత్త పిట్టలు కావాలన్నా—" సుధీర్ మోహన్ వేపు చూసాడు.

'ఎగ్జాట్లీ కరెక్ట్ గురూ' అన్నాడు సిగరెట్టు వెలిగించి.

"వాడేమన్నా చీటింగ్ గాడేమో సరిగ్గా తెలుసుకొని పెట్టండి." గోపీ అన్నాడు.

"అసలు వాడు ఈ పనులన్ని చెయ్యగలడా చూ_ పల్లెటూరిబైతులాగున్నాడు." దిలీప్ సందేహం.

"లేదు సార్ అలా కనిపిస్తానంతే మీరేటి సెపితే సిటికెలో ఆ పని సేసేసు కొస్తాను సార్" అన్నాడు వీరప్పడు.

"ఒరే నీ పేరేమిటిరా!" అడిగాడు మోహన్.

"నా పేరు వీరప్పడు సార్."

"ఒరే అప్పడూ ఇటునంటి మందు సీసాలు తేవడమే కాకుండా తాగడం కూడా తెలుసో లేదో ముందు చెప్పు!"

"తాగడం తెలీదండి. కాని మా నాయన 3 సారా సీసాలు తెమ్మంటే నేనే తెచ్చేస్తుంటాను సార్ మా వూళ్ళో."

"ఫర్వాలేదు మనోడు గట్టోడే" అన్నాడు సుధీర్.

"ఒరే కొత్త కొత్త పిట్టల్ని తేవడం అలవాటుందా?" అన్నాడు మోహన్.

"అలవాటేమిటి సార్ మావూరి పెద్దలకు ఎప్పుడు సరఫరా సేత్తానేవుంటాను. ముసిముసిగా నవ్వి చెప్పాడు.

"అమ్మో నే నేమిటో అనుకున్నారా! మనల్ని మించిపోయేటట్టున్నాడు" సుధీర్ అన్నాడు.

మోహన్లో ఉత్సాహం వుప్పొంగింది. "ఒరే వీరప్పడూ నీకో పరీక్ష రేపు."

"ఏమిటి సార్ ఆ పరీక్ష? సెప్పండి సార్" అన్నాడు వీరప్పడు.

"మరేం లేదు వీరప్పడు. మా అందరికీ కొత్తపిట్టలంటే మహా తహతహ. నువ్వుగాని ఓ కొత్తపిట్టని రేపు రాత్రిలోగా తెచ్చితివో... తంతే బూర్లెగంపలో పడ్డట్టే నీ పని"

"అలాగే సార్. కాని వైజాగ్లో దొరకవు, అనకాపల్లినించి తెస్తాను."

మర్నాడురాత్రి 9 గంటలకి వీరప్పడు రూంకి వచ్చేటప్పటికి, మిత్రులందరూ సుష్టిగా భోంచేసి మందు పట్టిస్తున్నారు. వీరప్పడ్ని చూగానే ఎగిరిగంతులేసారు.

"ఏవీ పిట్టలు" అన్నాడు మోహన్.

"మూడుదఫాలొచ్చినా మీ రూంకి. తాళాలేసున్నాయని పోయినా. సూడండి కొత్త రకాల పిట్టలు. రేపు కైమా వండి పెట్టితినా మరి ఒదలరు." చేతి సంచిలో నుండి చచ్చి వున్న పాలపిట్టల్ని తీసి నేలపై పెట్టాడు వీరప్పడు.

—రమ (విశాఖపట్టణం)